
# ఆనందముంది ఆత్మలేదు

డి. వెంకట్రామయ్య



ఈమధ్యనే కొన్న 'ఈ'క్లాస్ మెర్సిడెస్ బెంజ్‌కారు హైవేమీద గంటకి తొంభై కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతోంది. వెనకసీటు మధ్యలో కాళ్ళు బార జాపుకుని, తల వెనక్కి వాల్చి కూర్చున్న ఆనందరావు అరమోడ్పు కన్నులతో, తన్మయత్వంతో తనకిష్టమైన హిందీ పాట వింటున్నాడు. బయట ఎండ మండుతున్నా అతని కార్లో మాత్రం చలి పుట్టేంత చల్లగా వుంది. ఇంట్లో అయినా, ఆఫీసులో అయినా, కార్లో అయినా ఏసీ అంత చల్లగా వుంటే తప్ప అతనూరుకోడు. అతను వింటున్న పాట ఎంత మంద్రస్థాయిలో వుందో అంత మధురంగానూ వుంది. అతనికిష్టమైన చందన పరిమళం కారునిండా కమ్ముకుంది. 'పెర్సనల్ పెర్‌ఫ్యూమ్ ఎలాంటిదో పెర్సనల్ మ్యూజిక్ కూడా అంతే... నువ్వు వాడే పెర్‌ఫ్యూమ్‌ని బట్టి నీ టేస్ట్ ఎలాంటిదో గ్రహించినట్టే నువ్వు వినే మ్యూజిక్‌ని బట్టి కూడా నీ టేస్ట్ ఏమిటో తెలుసుకోవచ్చు....' అంటాడు ఆనందరావు. ఆ నగరం లోని అతి సంపన్న వర్గాల్లోనూ, వ్యాపార, పారిశ్రామిక ప్రముఖుల్లోనూ, బంధుమిత్ర పరివారంలోనూ 'గొప్పటేస్టున్న' వాడన్న పేరు అతనికుంది. కేవలం వేష భాషల్లో మాత్రమే కాదు. ఇంట్లో, ఆఫీసులో, నిత్య జీవిత వ్యవహారాలన్నింటిలో, ఆఖరుకి అతనువాడే వస్తు వాహనాల్లో సైతం అతని 'హై క్లాస్' అభిరుచులు ప్రస్ఫుటంగా తెలుస్తాయంటారందరూ. అలా అంటారనీ అనుకుంటారనీ అతనికీ తెలుసు. అందుకే చాలా 'కాన్షస్'గా తన 'క్లాస్'ని కాపాడుకుంటూ వుంటాడు.

ఎదురుగా వస్తున్న లారీ డ్రయివర్ చెవులు బద్దలయ్యేట్టుగా మోగించిన హారన్ మోత ఆనంద రావు ఆలోచనలకి అంతరాయం కలిగించింది. సిటీ రోడ్ల మీదయినా, వూరి బయటయినా సరే, అంత పెద్దగా హారన్ మోగించే వాళ్ళంటే అతనికి మంట, మా చెడ్డ కోపమొస్తుంది. ఇప్పుడూ అలాగే వచ్చింది. 'సెన్సూ వుండదు; సెన్సిటివ్ సెన్సూ వుండదు వెధవలకి...' అని తిట్టుకున్నాడు. హద్దు మీరిన ఏ శబ్దాన్నీ అతను భరించలేడు. అవసరానికి మించి బిగ్గరగా మాట్లాడే వాళ్ళని సైతం అతను సహించలేడు. ఎంత క్లాస్‌గా వుంటాడో అంత సెన్సిటివ్ మనిషి అని కూడా అతనికి పేరుంది. వినిపిస్తున్న పాట ఆగిపోయింది... అయిపోయింది. అప్పటిదాకా వెనక్కి జారగిలబడి కూర్చున్న ఆనంద రావు మామూలు పొజిషన్లోకి వచ్చాడు; కోటు సర్దుకున్నాడు; టై సవరించుకున్నాడు. నగరానికి యాభై కిలోమీటర్ల దూరాన నూట యాభై ఎకరాల స్థలంలో, ఎనిమిది వందల కోట్ల రూపాయల ఖర్చుతో, ఏణ్ణర్థం కిందట అతను నిర్మించిన అధునాతన విద్యుత్పరికరాల కర్మాగారం గేటు దాటి, 'ఎడ్మినిస్ట్రేటివ్ బ్లాక్' పోర్టికో లోకి అతి హుందాగా ప్రవేశించింది అతని కారు.

***

'ఆనంద్ ఎలక్ట్రికల్స్' కంపెనీ మొట్టమొదటి ఏ.జి.ఎం (వార్షిక సర్వసభ్య సమావేశం) ఆనంద రావు ఆశించిన దానికంటే విజయవంతంగా నడిచింది. ఆ సంస్థ ఛైర్మన్ హోదాలో అతనుచేసిన ప్రసంగం షేర్ హోల్డర్లందర్నీ అమితంగా ఆకట్టుకుంది. 'ఆనంద్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్'కి ఈ దేశం లోనే కాదు – విదేశాల్లో సైతం ఎటువంటి గౌరవ ప్రతిష్ఠలున్నాయో మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను. గతంలో మేము నెలకొల్పిన ఇతర సంస్థల్లాగే ఈ సంస్థ కూడా అతి త్వరలోనే అత్యున్నత స్థాయికి చేరుకోగలదనడంలో నాకెటువంటి సందేహమూ లేదు... కేవలం వ్యాపార పరమైన విజయాలు సాధించడంతో మేము సంతృప్తి చెందలేము... వస్తునాణ్యతకీ, వాడకందార్ల నమ్మకానికీ తిరుగులేని నిదర్శనంగా ఈ సంస్థని నిలబెట్టే వరకూ మేము నిద్రపోము..' అని అతను ప్రకటించినప్పుడు హర్షధ్వానాలతో ఆ సభ మారు మోగిపోయింది. సమావేశం ముగియగానే అందరూ ఆనందరావుని చుట్టుముట్టారు. అతనితో కరచాలనం చెయ్యడానికీ అతన్ని అభినందించడానికీ అంతా ఎగబడ్డారు. దాదాపు గంట సేపు అనర్గళంగా సాగిన ఉపన్యాసంలో అతను కనబర్చిన ఆంగ్లభాషా నైపుణ్యాన్ని కొందరు మెచ్చుకుంటే, అంతసేపూ పెదాలపై చిరునవ్వు చెదరకుండానే అతను ప్రదర్శించిన ఠీవిని దర్పాన్నీ మరికొందరు ప్రశంసించారు. ఈ ప్రశంసలన్నిటినీ పొగడ్తలన్నిటినీ కూడా ఎంతో 'గ్రేస్‌ఫుల్'గా అందుకున్నాడు ఆనందరావు. ఇలాంటివన్నీ అతనికి అలవాటే. ఏ.జి.ఎం.కి వచ్చిన వారందరికీ అతను ఏర్పాటుచేసిన విందు మరింత గొప్పగా జరిగింది. 'ఈ పార్టీకే పది లక్షలు ఖర్చయి వుంటుంది...' అనుకున్నారంతా. అది పొరపాటు... పన్నెండు లక్షలు ఖర్చయింది! ఆనందరావు ఖర్చుకి వెనకాడే మనిషి కాడు.

***

అత్యవసరంగా ఆరు వందల కోట్ల రూపాయల డబ్బు కావలసి వచ్చింది. ఆ సమస్య గురించి ఆట్టే ఆలోచించవలసిన అవసరం కలగలేదు ఆనందరావుకి. అసలు అదొక సమస్యలానే అనిపించలేదతనికి. ఇప్పటికే – 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్'; 'టెక్స్‌టైల్స్'; 'ఫుడ్ ప్రాసెసింగ్'; 'పవర్ జనరేషన్'; 'ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్' వంటి రంగాల్లో అతనికి భారీ పరిశ్రమలున్నాయి. అతి పెద్దవ్యాపారాలున్నాయి. అయిదారు దేశాలకు ఎగుమతులున్నాయి. అన్నిటికీ మించి, వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో అతనికి మచ్చలేని మంచిపేరుంది. ఆ పేరే ఇప్పుడు పనికొచ్చింది. పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేకుండానే పని జరిగిపోయింది. జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులన్నీ అతను అడగటమే ఆలస్యమన్నట్టుగా అప్పులిచ్చాయి. అతను పెట్టబోయే పెట్టుబడిలో చిన్న వాటా ఇచ్చినా చాలునంటూ, అతను అడిగినంతా ఇవ్వడానికి ఎంతోమంది ముందుకొచ్చారు. ఎన్నో దేశీయ, విదేశీయ కంపెనీలతో పోటీపడి, మిగతా వారికంటే వందకోట్లు ఎక్కువగానే 'ఆఫర్' చేసి, మూత పడటానికి సిద్ధంగా వున్న ఆ 'ఫార్మస్యూటికల్' కంపెనీని టేకోవర్ చేశాడు – ఆనందరావు. అంతే అతని అధీనంలోని పారిశ్రామిక సముదాయంలో 'ఆనంద్ ఫార్మస్యూటికల్స్' అనే పేరుతో మరో పతాకంపై కెగిరింది. రెండేళ్ళు తిరిగే సరికి ఆ కంపెనీ తిరిగి పట్టాల మీదికి రావడమే కాదు. నికర లాభం ఆర్జించే స్థితికి చేరుకుంది.

ఇప్పటికే ఇరవైసార్లకి పైగా అమెరికా వెళ్ళొచ్చిన ఆనందరావుకి ఆ దేశమంటే మొహం మొత్తినట్టయింది. అందుకే ఈ మాటు ఫ్రాన్స్ బయల్దేరాడు. ఈ దేశమూ అతనికి కొత్తేమీ కాదు గాని, కేవలం వినోదపర్యటన కాకుండా, ఒక ఫ్రెంచి కంపెనీతో వ్యాపార సంబంధాలు పెట్టుకోవాలనే కొత్త



## బికినీలో స్నేహ!

స్నేహ బికినీలో నటించనుంది. ఇది పుకారు కాదు, నిజం. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్న తమిళ సినిమాలో ఓ సీన్‌లో ఆమె బికినీలో నటించింది. ఈ విషయాన్ని ఆమె కొట్టిపారేసినా, బికినీలో ఆమెను చూసిన వారు మాత్రం ఆమె రూపాన్ని మరిచిపోలేకుండా ఉన్నారట! అందమైన చిరునవ్వుతో, నిండైన చీరకట్టులో మాత్రమే స్నేహను ఊహించుకునే అభిమానులు బికినీలో ఆమెను ఎలా రిసీవ్ చేసుకుంటారో? అన్నది అటు దర్శక నిర్మాతలకు, ఇటు స్నేహకు సందేహంగా ఉండడంతో ఈ విషయాన్ని సినిమా విడుదల వరకూ గోప్యంగా ఉంచుతున్నారని కోలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా విజయవంతం అయితే మరిన్ని సినిమాల్లో ఈ విధంగా నటించే ఆలోచనలో స్నేహ ఉన్నట్లు సమాచారం. ఇక నుంచి స్నేహను చీరలో కాకుండా, బికినీలో చూసి తరించాల్సిందేనని పలువురు అంటున్నారు.


ఆలోచనతో వచ్చి, ప్యారిస్‌లో తనకింతకుముందే పరిచయమున్న హోటల్‌లో దిగాడు. సింగపూర్, మలేసియా, నేపాల్, చైనా వంటి అనేక ఆసియా దేశాలకిప్పటికే అతని పరిశ్రమల ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అమెరికాకి కూడా కొంత కాలం ఎగుమతులు జరిగాయి గాని, ఇటీవల ఆ దేశంలో ఏర్పడిన పరిస్థితుల కారణంగా ప్రస్తుతం నిలిచిపోయాయి. ఐరోపా దేశాల గురించి ఆలోచించినప్పుడు ఆనందరావు దృష్టి ముందుగా ఫ్రాన్స్ మీదనే పడింది. ఆ దేశంతో ఇంతకు ముందు వ్యాపారం జరపకపోయినా, అక్కడి పారిశ్రామిక ప్రముఖులు కొందరితో అతనికి పరిచయాలున్నాయి. అదీగాక ప్యారిస్ నగరమంటే అతనికి ప్రత్యేకమైన ఇష్టముంది. అక్కడి ప్రజల అలవాట్లూ, ఆహార విహారాలు, వినోద విలాసాలూ అతనికి బాగా నచ్చాయి. ఫ్యాషన్ ప్రపంచమంతటికీ ప్యారిస్ నగరం రాజధాని వంటిదని కూడా అతనికి తెలుసు. యూరోపియన్ దేశాల మార్కెట్‌నీ, అక్కడి ప్రజల అభిరుచుల్నీ దృష్టిలో వుంచుకుని, తాను ఈ మధ్యనే నెలకొల్పిన ఎక్స్‌పోర్ట్ ఓరియంటెడ్ గార్మెంట్ మేకింగ్ ఇండస్ట్రీ 'ఆనంద్ గార్మెంట్స్' సంస్థలో తయారవుతున్న రెడీమేడ్ దుస్తులు ఫ్రెంచి దేశ ప్రజలకి – ముఖ్యంగా ప్యారిస్ నగర వాసులకి అమ్మాలని ఆనందరావు ఆలోచన. తన ఆలోచనలకి ఏ విధంగా కార్యరూపం కల్పించాలో, తన ప్రయత్నాలను ఏ రకంగా సఫలం చేసుకోవాలో అతనికి బాగా తెలుసు.

ఆనందరావు ప్యారిస్‌లో వారం పది రోజులున్నాడు. అతనక్కడ ఏర్పాటుచేసిన ఫ్యాషన్ షోలకీ, ప్రత్యేక విందులకీ, పార్టీలకీ ఆ దేశపు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు భారత దౌత్య కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. ఆనందరావు ఆతిథ్యానికీ, అతని 'స్టైల్' కీ, అతని 'గ్రేస్' కీ, ముగ్ధులైపోయిన అతిథులంతా 'ప్రిన్స్ ఛార్మింగ్ ఆఫ్ ది ఇండియన్ ఇండస్ట్రీ' అంటూ పొగిడారు. మాటలు కలిశాయి. పరిచయాలు పెరిగాయి. ఒప్పందాలు కుదిరాయి. ఈఫిల్ టవర్‌మీద అవలీలగా తన జెండా ఎగరేశాడు ఆనందరావు!

***

అడవుల్లో, కొండల్లో ఎక్కడో మారుమూల ప్రాంతంలో వున్న ఆ ప్రదేశానికి చేరుకోవా లంటే కనీసం పది కిలోమీటర్ల దూరం కాలి నడకన వెళ్ళాలి తప్ప మరో మార్గం లేదు. అలాగే నడుస్తున్నాడు ఆనందరావు. హెలికాప్టర్లో వద్దామనుకున్నాడు గాని ఆ చుట్టు పక్కల హెలికాప్టర్ దిగటానికి అనువైన ప్రదేశం లేదనీ, దట్టంగా వున్న ఆ అడవుల్లో, ఎత్తుగావున్న ఆ కొండల్లో హెలికాప్టర్ ప్రయాణం అంతక్షేమం కాదనీ నిపుణులు చెప్పిన మీదట ఆ ఆలోచన విరమించుకుని కార్లో బయల్దేరాడు. నగరం నించి సుమారు మూడు వందల కిలోమీటర్ల దూరం అతను ప్రయాణించిన లేటెస్ట్ మోడల్ బి.ఎం.డబ్ల్యూ. కారు, దాని వెనకా ముందు అతని సిబ్బంది ప్రయాణించిన మరో రెండు కార్లూ కొండ దిగువన వున్న ఒక గిరిజన గ్రామానికి దగ్గర్లో ఆపివేసి, అక్కణ్ణించి నడక ప్రారంభించారు.

దాదాపు రెండు గంటలపాటు నడిచాక గమ్యస్థానానికి చేరుకున్నారు ఆనందరావు, అతని సిబ్బందీ. మరీ అంత ఎత్తులేని ఒక గుట్ట పైకి ఎక్కి నిలబడ్డారు. వారి కళ్ళెదుట కనిపిస్తున్న దృశ్యం మనోహరంగా వుంది. అక్కడికి కాస్త దూరాన రెండు కొండల మధ్య నించి ఎన్నో మెలికలు, మలుపులూ తిరుగుతూ వచ్చి, కిందనున్న లోయలోకి అతి వేగంగా దూకుతోంది ఆ జలపాతం. ఎక్కడో పుట్టి, ఎక్కడెక్కడి నించో పారుతూ వచ్చిన సెలయేరు ఇక్కడ జలపాతంగా మారింది. లోయలో కిందికి దూకి, అక్కడో చిన్న తటాకంలో ఏర్పడి, అందులోంచి అడవిలోని పల్లపు ప్రాంతానికి పాకి, మరో మారు సెలయేరుగా పారుతోంది. ఆ జలపాతాన్ని కన్నార్పకుండా చూస్తున్న ఆనందరావు మనసులో భవిష్యత్ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ జలపాతం గురించి ఇటీవలే అతనికి వివరాలు తెలిశాయి.



ఆ నీరు అతి స్వచ్ఛంగా వుంటుందనీ, ఆ యేరు ఏడాది పొడుగునా ఎడతెగకుండా పారుతూనే వుంటుందనీ తెలుసుకున్న ఆనందరావు ఆ అటవీ ప్రాంతంలోనే ఒక 'బోట్లింగ్ ప్లాంట్' నెలకొల్పి, స్వచ్ఛమైన ఆ నీటిని సీసాల్లో నింపి, 'మినరల్ వాటర్'గా అమ్ముకోడానికవసరమైన పథకాలు రచించుకున్నాడు. ప్రభుత్వం నించి అవసరమైన అనుమతులు తెచ్చుకుంటే చాలు, మిగతా పనులు అవే జరిగిపోతాయన్న ఆలోచనలో వున్నాడు. అందుకే ఇద్దరు ఇంజనీర్లని కూడా తన వెంట తీసుకొచ్చాడు.

దాదాపు గంటసేపు అక్కడేవుండి, ఇంజనీర్లతోనూ ఇతర సిబ్బందితోనూ చర్చలు జరిపిన ఆనందరావు సపరివారంగా తిరుగుప్రయాణం ప్రారంభించే సరికి, సాయంత్రం కావచ్చింది. కార్లు వదిలిన వూరికి చేరుకోవాలంటే కనీసం రెండు గంటలు పడ్తుంది. చీకటిపడితే ఆ అడవిలో ప్రయాణం కష్టమౌతుందని ఇంతకుముందే అక్కడికోసారి వచ్చి, జలపాతమున్న ప్రాంతాన్ని పరిశీలించి వెళ్ళిన ఆనందరావు సిబ్బంది చెప్పారు. అందరూ త్వరగా నడుస్తున్నారు. మరో అరగంట గడిచేసరికి అప్పటి దాకా వున్న ఎండ పొడ మాయమైంది. మెలమెల్లగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఆరు గంటలైనా కాకముందే చీకట్లు ముసురుకుంటున్నాయి. తలపైకెత్తి ఆకాశం వైపు పరిశీలనగా చూసిన ఆనందరావు – 'వర్షం వచ్చేట్టుంది....' అన్నాడు.

***

వర్షం రావటమే కాదు. వచ్చీ రావటమే కుండపోతగా కురుస్తోంది. ఆనందరావు, అతని బృందమూ అప్పటికే తడిసి ముద్దయిపోయారు. కాస్సేపు ఆ చెట్టుకిందా ఈ చెట్టు కిందా తలదాచుకున్నారు గాని లాభం లేక పోయింది. క్షణక్షణానికీ వాన పెరుగుతోంది గాని తగ్గటం లేదు. వానకి తోడు పెద్దపెద్ద ఉరుములు.. మెరుపులు... చీకటి చిక్క బడింది. మరి కాస్సేపు అక్కడుంటే అడవిలో చిక్కుబడిపోతామనే భయంతో, ఆ చీకట్లోనే దారి వెతుక్కుంటూ నడుస్తున్నారు. కన్ను పొడుచుకున్నా కనిపించటం లేదు... ఎక్కడే గొయ్యి వుందో, ఎక్కడే ముళ్ళపొద వుందో తెలియటం లేదు. అయినా అలాగే పడుతూ లేస్తూ ముందుకి సాగుతున్నారు. ఎదురుదెబ్బలు తగిలి, ఇద్దరు ముగ్గురు ముందుకి బొక్కబోర్లా పడ్డారు. ముక్కులూ మొహాలు చితికాయి... అయినా ఆగటానికి లేదు... ఆగి చేసేదేమీ లేదు.... కార్లు నిలిపిన చోటికి దగ్గరగా వచ్చి వుంటామనుకునే లోపలే వాన మరింత పెరిగింది... ఆ వానకి గాలి కూడా తోడైంది.

ఆ గాలివానలో, ఆ కారు చీకట్లో అతికష్టమ్మీద

అడవిలోంచి బయటపడిన ఆనందరావు, అతని సిబ్బందీ తమ తమ కార్లలో దూరి, తలుపులు బిగించుకుని 'హమ్మయ్య... బతికి బయటపడ్డాం'' అనుకున్నారు. అసలు ప్రమాదంనించి తామింకా బయటపడలేదనే విషయం ఆ తర్వాత మరికొంత సేపటిగ్గాని వారి కర్థం కాలేదు. అప్పటిదాకా గాలి వాన అనుకున్నది అతి కొద్దిసేపట్లోనే పెనుతుఫానుగా మారింది. ఎటుచూసినా కటిక చీకటి... చెవులు చిల్లులుపడేట్టు హోరుగాలి... గుండెలవిసేట్టు ఉరుములు... డ్రయివర్‌తో చెప్పి తన కారు హెడ్ లైట్లు ఆన్ చేయించాడు ఆనందరావు. అయినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. అయిదారు అడుగుల దూరంలో ఏముందో కూడా కనిపించడం లేదు. కార్లు కదిలి ముందుకు సాగే అవకాశం లేదనీ, ఎంత మాత్రమూ, అలాగని తలుపులు బిగించుకుని కార్లలో కూర్చోవడం కూడా ప్రమాదమేననీ అతని కర్థమైంది. తల దాచుకోడానికి వెంటనే ఏదోచోటు వెతుక్కోవాలి. ఆ మాట తన సిబ్బందితో చెప్పాలని అనుకుంటూ వుండగానే, సమీపంలో వున్న ఒక మహావృక్షపు కొమ్మ ఫెళఫెళ విరిగి అతని కారుపై పడింది. కోటిన్నర రూపాయల ఖరీదు చేసే ఆకారు పైభాగమంతా పచ్చడై పోయింది. ఆ శబ్దానికి అదిరిపడిన ఆనందరావు సిబ్బంది పరుగు పరుగున వచ్చి అతనికారు చుట్టూ మూగారు. ఎలాగో తంటాలు పడి కారు లోపల ఇరుక్కుపోయిన ఆనందరావునీ డ్రయివర్నీ బయటికి లాగారు. ఎవరికీ పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు గాని ఆ షాక్‌నించి తేరుకోడానికి అందరికీ కొంత సమయం పట్టింది.

ఇంకా అక్కడుంటే ఇంకేమీ జరుగుతుందోనన్న భయంతో, భయంకరమైన ఆ తుఫాను లోనే దారి వెతుక్కుంటూ బయల్దేరారు. అప్పటికే ఆ ప్రాంతమంతా మోకాటి లోతు నీళ్ళు నిలిచాయి ఒకరి చేతులొకరు పట్టుకుని ఒక్కొక్కఅడుగూ ముందుకెళ్తున్నారు. ఎంతదూరం వెళ్ళినా దారీ తెన్నూ కానరావటం లేదు. కార్లు నిలిపిన చోటికి దగ్గర్లోనే వుందనుకున్న గిరిజన గ్రామం ఎక్కడుందో తెలియటం లేదు. అసలు తాము ఏ దారిన వెళ్తున్నామనేది కూడా వాళ్ళకర్థం కావటం లేదు. అయినా అలాగే ప్రాణాలరచేత పెట్టుకుని, సర్వశక్తులూ కూడా గట్టుకుని ముందుకి నడుస్తున్నారు.

అలా మరో అరగంట నడిచాక, తటుక్కున మెరిసిన మెరుపు వెలుగులో అల్లంత దూరాన కాస్త ఎత్తుగా వున్న ప్రదేశంలో ఏదో గుడిలాంటిది కన్పించడంతో వాళ్ళ ప్రాణం లేచి వచ్చింది. అది గుడి అన్నమాట నిజమేగాని, పాడుబడ్డ గుడి. గోడలన్నీ కూలి పోయాయి. పైకప్పు మాత్రం కొంతమేర మిగిలింది. ఆ కప్పు కిందికి చేరిన ఆనందరావూ అతని సిబ్బందీ అక్కడే తలో చోటా కూలబడ్డారు. పైనించి కురవటం లేదు గాని, మిగతా అన్ని వేపుల్నించీ వానజల్లు కొడ్తూనేవుంది; ఈదురుగాలికొస్తూనే వుంది; ఉరుములు ఉరుముతూనే వున్నాయి; మెరుపులు మెరుస్తూనే వున్నాయి. ఎక్కడో తెలియకుండా పిడుగులు పడ్తూనే వున్నాయి.

ఇది మామూలు గాలివాన కాదు, మహా ప్రళయం అనుకున్నాడు ఆనందరావు. శిథిల దశలో వున్న ఆ గుడికప్పు ఎప్పుడైనా కూలవచ్చుననీ, అదే జరిగితే తామంతా ఆ శిథిలాల కింద సమాధి కావల్సిందేనని కూడా అనుకున్నాడు. అదేజరిగితే ఎన్నో ఏళ్ళుగా ఎంతో శ్రమించి, కఠోరమైన క్రమశిక్షణతో, కార్యదీక్షతో, అంతకుమించిన మేధాశక్తితో అంచెలంచెలుగా తాను నిర్మించిన పరిశ్రమలూ, విస్తరింపచేసిన వ్యాపారాలూ, ఇన్ని వేల కోట్ల రూపాయల ఆస్తులూ అన్నీ ఈ గుడి కప్పుకూలినట్టు కూలిపోతాయి గదా, తన భార్యాబిడ్డలు దిక్కులేని వారైపోతారు గదా అన్న ఆలోచన కూడా అతనికొచ్చింది. ఎందుకో గాని ఆ సమయాన అతన్నీ ఆలోచనలేవీ భయపెట్టలేదు. ఆశలకీ, నిరాశలకీ, కాంక్షలకీ వ్యామోహాలకీ, భయాలకీ అతీతమైన భావాలేవో అప్పుడతని మనసులో మెదులుతున్నాయి.

***

మరోగంటకి తెల్లవారుతుందనగా తుఫాను శాంతించింది. మబ్బులన్నీ విడిపోయి, పొద్దు పొడిచాక గాలీవాన పూర్తిగా నిలిచిపోయాయి. కూలిన చెట్టుకొమ్మ కింద ఇరుక్కుపోయిన కారు అక్కడే వదిలేసి, మిగతా రెండు కార్లలోనూ సర్దుకున్న ఆనందరావు బృందం దారి వెతుక్కుంటూ బయల్దేరి, మెయిన్ రోడ్డు మీదికెక్కేసరికి దాదాపు ఎనిమిది గంటలైంది. పెనుముప్పునించి బయటపడిన ఉపశమనం వుంది గాని, ఎవరూ ఇంకా పూర్తిగా తేరుకోలేదు. తెల్లవార్లూ ఎవరికీ కంటిమీద కునుకు లేదు. ఆహారం అసలే లేదు. తుఫానులో చిక్కుకుని ప్రాణభయంతో వున్నంత సేపూ తెలియలేదు గాని, తెల్లవారి గండంగడిచి బయటపడ్డాక అందరి కడుపుల్లోనూ ఆకలి మండుతోంది.

హైవే మీద ఎంతదూరం వెళ్ళినా వారి ఆకలి మంటలు చల్లార్చుకునే మార్గం కనబళ్ళేదు. చివరికెక్కడో ఒకచోట చిన్న టీ స్టాల్ లాంటిదేదే కనబడి ఆగితే - అక్కడ ముక్కిపోయిన బిస్కెట్లూ, ఎండిపోయిన బ్రెడ్డూ తప్ప మరేమీ లేవు.

మరో గంట తర్వాత మార్గమధ్యంలో ఏదో వూరు కనబడితే అక్కడా ఆగి, ఆరాలు తీశారు గాని తిండి మాత్రం దొరకలేదు. గత రాత్రి క్షణక్షణానికీ పెరిగిపోయిన గాలి వానకి మల్లే, ఇప్పుడు వారి ఆకలిమంటలు పెరిగిపోతున్నాయి. కాళ్ళు గుంజుతున్నాయి; కళ్ళు తిరుగుతున్నాయి; కార్లలో కూడా స్థిమితంగా కూర్చోలేక పోతున్నారు. అందరిలోకీ ఆనందరావొక్కడే కాస్త నిబ్బరంగా వున్నాడు. అక్కడికి మరి కాస్త దూరాన మరో వూళ్ళో, డ్రయివర్‌కి దూరపు బంధువొకాయన వున్నాడు. ఆనందరావు అనుమతి తీసుకుని కారు ఆ గ్రామం వేపు మళ్ళించాడు డ్రయివర్..

***

ఆ కుగ్రామంలో ఆ బీదరైతు ఇంట్లో చింకిచాపల మీదా, గోనెపట్టాల మీదా చతికిలబడి కూర్చుని, ఆ రైతు భార్య అప్పటికప్పుడు వేడివేడిగా కాల్చి యిచ్చిన జొన్న రొట్టెలు ఆవురావురుమంటూ తిన్నారు ఆనందరావూ అతని సిబ్బందీ. తన ఇంట్లో వంట వాళ్ళు తనకోసం ప్రత్యేకంగా వండి పెట్టినవో, వందలూ వేలూ ఖర్చుపెట్టి స్టార్ హోటళ్ళలో తిన్నవో తిప్ప మరో తిండి ఏదీ ఎన్నడూ ముట్టని ఆగర్భ శ్రీమంతుడు ఆనందరావుకి. ఆ సమయాన ఆ ఎండు రొట్టెలూ, పల్చటి చారులా వున్న ఆ కూర అతి మధురంగా అనిపించాయి.

అందరూ తిన్నాక అక్కణ్ణించి బయల్దేరబోయే ముందు పర్సులోంచి ఒక వెయ్యి రూపాయల నోటు తీసి ఆ రైతు చేతికివ్వబోయాడు ఆనందరావు. అది పుచ్చుకోకుండా, అతి వినయంగా చేతులు జోడించి, 'వద్దు బాబూ... మేము అన్నం అమ్ముకోం... మీబోటి మారాజులు మా యింటికొచ్చారు... మా యింటో తిన్నారు.. అది చాలు... నిన్నరేత్తిరంతా శానా ఇబ్బందులు పడ్డారు. జాగర్తగా ఎల్లిరండి బాబూ...'' అన్నాడారైతు. ఆనంద రావు మరేమీ అనలేక పోయాడు.

***

కొత్తగా ఒక పరిశ్రమ ప్రారంభించినప్పుడూ, కొత్త వ్యాపారం మొదలెట్టినప్పుడూ కొత్తగా మరో కోటి రూపాయలు కూడా బెట్టినప్పుడూ ఎంతో సంబరపడిపోయే వాడు ఆనందరావు. హద్దులు మీరిన ఈ సంపదకీ అవసరాలకి మించిన ఈ సంపాదనకీ ఏమైనా అర్థముందా, అసలిందులో ఏమైనా ఆనందముందా అన్న కొత్త ఆలోచనలు కలిగాయి ఆ రోజు ఆనందరావుకి.

★

డి.వెంకట్రామయ్య
040-23067067

